
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శ్రీశైలం దేవస్థానంలో బదిలీలు

శ్రీశైలం, జనవరి 18: శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని బదిలీ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా 20 మంది రెగ్యులర్, నలుగురు కాంట్రాక్ట్, ఒక అవుట్‌సోర్సింగ్, మరొకరు సిస్టమ్ అడ్మిన్ బదిలీ అయ్యారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉత్తర్వుల ప్రకారం సిబ్బందికి కేటాయించిన విధులలో వెంటనే రిపోర్టు చేయాలని ఈఓ ఆదేశించారు.

జుర్రేరు వాగును ఆక్రమించి నిర్మించిన ఇళ్లు



జుర్రేరు జాడలేవీ?

- ఆక్రమణలకు గురవుతున్న వాగు
- పట్టించుకోని అధికారులు

బనగానపల్లె, జనవరి 18: జుర్రేరు ఉంటుందా.. ఆక్రమణలతో మాయమవుతుందా.. అనే సందేహం స్థానికులకు కలుగుతోంది. భారీ ఆక్రమణలతో వాగులు, వంకలు కుచించుకపోతున్నాయి. జుర్రేరుకు అదే గతి పట్టింది. ఒకప్పుడు వ్యవసాయానికి ఉపయోగపడే జుర్రేరు ఇప్పుడు కుచించుకుపోయింది. బనగానపల్లె నియోజకవర్గం మీదుగా కోవెలకుంట్ల పట్టణం వరకు జుర్రేరు వాగు పారుతుంది. దద్దనాల ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన ఈ వాగు పాతపాడు, యాగంటిపల్లె, బనగానపల్లె, ఇల్లూరుకొత్తపేట, అమడాల, బిజనవేముల మీదుగా కోవెలకుంట్ల సమీపంలో కుందూ నదిలో కలుస్తుంది. సుమారు 25 కిలోమీటర్లు పారే జుర్రేరు జాడలు కనుమరుగవుతున్నాయి.

బనగానపల్లె మండలంలోని ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు జుర్రేరు వాగు మీద ఉంది. దీని వల్ల 1516 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పరోక్షంగా భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్ల ద్వారా 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పాతపాడు గ్రామం నుంచి ప్రారంభమయ్యే జుర్రేరు వాగు కుందూనదిలో కలుస్తోంది. సమారు 25 కిలో మీటర్లు పారే జుర్రేరు పాతపాడు గ్రామం నుంచి ప్రారంభమవుతుంది. గత కొద్ది కాలంగా వాగుకు ఇరువైపుల పొలాలు ఉన్నవారు ఆక్రమించుకుంటూ పోవడంతో జుర్రేరు చిన్న కాల్వలా తయారైంది. పడమటి పల్లెలు పాతపాడు, సాధుకొట్టం, మీరాపురం, చిన్నరాజుపాలెం, క్రిష్టగిరి, తండా, పసుపుల, పెద్దరాజుపాలెం, పెద్దరాజుపాలెం తండా, యాగంటిపల్లె గ్రామాలతో పాటు బనగానపల్లె, ఇల్లూరుకొత్తపేట, మిట్టపల్లె, అమడాల, బిజనవేముల, కోవెలకుంట్ల వరకు జుర్రేరు వాగు పారడం వల్ల తాగునీరు, సాగునీరు పరోక్షంగా అందుతోంది. అలాంటి ఈవాగు రోజురోజుకు ఆక్రమణలకు గురవుతోంది.

గతంలో ఆక్రమణలపై చర్యలు: గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన విజయకుమార్ హయంలో జుర్రేరు వాగు ఆక్రమణలను అరికట్టాలని అప్పటి తహసీల్దారును ఆదేశించారు. సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధకారులను ఆదేశించారు. సర్వే కొనసాగకపోగావడంతో ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో వాగు ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని గుర్తించి వాగును విస్తరించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వారు కూడా పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు హద్దే లేకుండా పోయింది.



వాగును ఆక్రమించి పంటలు పండించుకుంటున్న వైనం

చోద్యం చూస్తున్న రెవెన్యూ, గ్రామ పంచాయతీ, మైనర్ ఇరిగేషన్ శాఖాధికారులు

బనగానపల్లె పట్టణంలో జుర్రేరు వాగు మరింత ఆక్రమణలకు గురయింది. వాగుకు ఇరువైపుల నివసించేవారు జుర్రేరు వాగులోకి ఇళ్లు, ప్రహరీలు కట్టుకున్నారు. అలాగే వాగును ఆక్రమించి పాఠశాలలు, కట్టెల డిపోలు, రైస్ మిల్లులు నిర్మించారు. యజమానులు ఆక్రమించుకుంటూ పోతున్నారు. బనగానపల్లె పట్టణంలో జుర్రేరు వాగులోనే దారి కూడా ఏర్పాటు చేసుకున్నారు. వాగులో కట్టడాలు నిర్మించ కూడదు.. అయినా అనుమతులు లేకుండా భారీగా వాగులోనే వ్యాపార సంబంధమైన కట్టడాలు, భవనాలు నిర్మించుకున్నారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు వారికి నోటీసులు కూడా ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి.

జుర్రేరుకు వరద వస్తే ముప్పే

జుర్రేరు వాగుకు వరద వస్తే మాత్రం ముప్పు వాటిల్లడం ఖాయం. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. వర్షాలు బాగా కురిసి ప్రాజెక్టులోకి వరద నీరు ఉధృతంగా పారితే అక్రమ నిర్మాణాలు తీవ్రంగ నష్టపోతాయి.



కుచించుకుపోయిన జుర్రేరు వాగు



అశ్వ వాహనంపై ఆది దంపతులు

- పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవ
- ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, జనవరి 18: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అశ్వ వాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, ఢమరుక నాదాలు, చెంచుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పుష్పోత్సవం, శయనోత్సవం : ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం ఘనంగా జరిపారు. వివిధ రకాల పూలు, మూడు రకాల పత్రాలతో స్వామి, అమ్మవార్ల సేవలో వినియోగించారు. అదేవిధంగా 9 రకాల ఫలాలు నివేదించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ఏకాంతసేవ జరిపి శయనోత్సవం నిర్వహించారు.

నంద్యాల జిల్లా పోలీసుల ప్రతిభ

- గ్రేహౌండ్స్ క్యాంప్‌లో నైపుణ్య శిక్షణ
- ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో బహుమతులు

నంద్యాల క్రైం, జనవరి 18: విశాఖ పట్టణంలో గ్రేహౌండ్స్ క్యాంప్‌లో గత ఏడాది నవంబరు 18 నుంచి ఈ సంవత్సరం జనవరి 2 వరకు జరిగిన శిక్షణలో నంద్యాల జిల్లా పోలీసులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా నుంచి ఐదుగురు స్పెషల్ పార్టీ పోలీసులను ఎంపిక చేసి పంపారు. శిక్షణ క్యాంప్‌లో మావోయిస్టుల కదలికలు, కూంబింగ్‌లో మావోయిస్టులు ఎదురుపడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాల్పులు ఎప్పుడు.. ఎలా జరపాలి, ఫైరింగ్‌లో శిక్షణ, ఇండోర్ విభాగంలో మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, అంబుస్ కార్డన్‌సర్చ్, ఆయుధాలలో అనుసరించే వ్యూహం తదితర విభాగాల్లో దాదాపు 45 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇందులో ఒకరు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కాగా నలుగురు సివిల్ పోలీసులు శిక్షణ తీసుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. శిక్షణలో అత్యంత ప్రతిభ కనబరచి టెస్ట్ ఇండోర్ విభాగం, ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రతిభ కనబరచిన వారిని ప్రశంసాపత్రాలతో సన్మానించి అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెళకువలను జిల్లాలో జరగనున్న మొబలైజేషన్ కార్యక్రమంలో పోలీసులకు కూడా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పోలీస్ కానిస్టేబుల్

నందికొట్కూరు వైసీపీ టికెట్ ఖరారు

- నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్
- బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గానికి బిగ్ షాక్

నంద్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గానికి వైసీపీ అధిష్టానం టికెట్ ఖరారు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్, అటు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వర్గాలకు కాకుండా మరొకరికి చాన్స్ ఇచ్చింది. కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుధీర్‌ను నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. ఈ మేరకు గురువారం రాత్రి రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిలు తాడేపల్లిలో సుధీర్ పేరును ప్రకటించారు. నందికొట్కూరు టికెట్ కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ సుధీర్ వైపే సీఎం జగన్ మొగ్గు చూపారు. సుధీర్ ప్రస్తుతం హైదరాబాద్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు. జగన్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటంతో నందికొట్కూరు టికెట్ ఆయన్ను వరించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఆర్థర్‌కు టికెట్ ఇవ్వకూడదంటూ మొదటి నుంచి అడ్డుపడుతూ వచ్చిన సిద్ధార్థరెడ్డికి కూడా జగన్ షాక్ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామికి టికెట్ ఇవ్వాలని కోరుతూ సీఎం జగన్‌ను కలిసి సిద్ధార్థ విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. అయితే జగన్ అవన్నీ ఏమీ పట్టించుకోకుండా సుధీర్‌కు అవకాశం కల్పించారు. దీంతో బైరెడ్డి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు అనుకూలమైన వ్యక్తికి టికెట్ వస్తుందని ఇన్ని రోజులు ఖర్చు పెట్టుకున్నామని, ఇప్పుడు పక్క జిల్లా నుంచి అభ్యర్థిని తీసుకురావడం ఏమిటని వైసీపీలోని ఓ వర్గం ఆగ్రహంతో ఊగిపోతోంది. డాక్టర్ సుధీర్‌కే టికెట్ అంటూ ఆంధ్రజ్యోతి ముందే చెప్పిన విషయం తెలిసిందే.



సీఎం జగన్‌తో డాక్టర్ సుధీర్

మహనీయుడికి మహా నివాళి

- ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకం
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్
- జిల్లా వ్యాప్తంగా విగ్రహాలకు పూలమాలలు



ఆత్మకూరులో టీడీపీ నాయకుల నివాళి



బనగానపల్లెలో యువకుల రక్తదానం



నందికొట్కూరులో నివాళులర్పిస్తున్న మాండ్ర

నంద్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని నంద్యాల జిల్లా వ్యాప్తంగా అభిమానులు, టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. నంద్యాల పట్టణంలో ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదర్ల రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్, జిల్లెల్ల శ్రీరాములు, తాతిరెడ్డి తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాససెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నంద్యాలలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు టీడీపీ నాయకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆళ్లగడ్డలో ఎన్టీఆర్‌కు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ నివాళులర్పించారు. నందికొట్కూరులో టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు, కార్యకర్తలు తరలివచ్చి రక్తదానం చేశారు. అనంతరం ఆమె కూడా రక్తదానం చేశారు. బనగానపల్లె, ఆత్మకూరు, డోన్ పట్టణాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కల్లూరు మండలం కురవగేరిలో పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు చరితారెడ్డి, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డిలు నివాళులర్పించారు.



రక్తదానం చేస్తున్న భూమా అఖిలప్రియ



కల్లూరులో నివాళులర్పిస్తున్న గౌరు దంపతులు



నంద్యాలలో నివాళులర్పిస్తున్న ఫరూక్ తదితరులు



పూలమాల వేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి



డోన్‌లో ఎన్టీఆర్‌కు నివాళి

ఆడేదెలా..?

- బహిరంగ మైదానంలో షటిల్ ఆట అంట..!
- నిబంధనలకు విరుద్ధంగా కోర్టు ఏర్పాటు
- ఆడే సమయంలో ఎగిరిపోతున్న షటిల్ కాక్
- సచివాలయ సిబ్బందితోనే క్రీడలు

ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడలు విమర్శలకు తావిస్తున్నాయి. షటిల్ కోర్టు బహిరంగ మైదానంలో ఏర్పాటు చేయడంపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గాలికి కాక్ ఎగిరిపోతుంటే ఎలా ఆడేదంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇండోర్ స్టేడియంలో జరగాల్సిన షెటిల్‌గేమ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం..ఆంధ్రకు క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. డిసెంబరు 26న నగరంలోని 52 వార్డులలోని 13 మైదానాలలో ఆడుదాం..ఆంధ్ర క్రీడాలను అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇటీవల షటిల్ టోర్నమెంటు కోసం ఏర్పాట్లు చేశారు. షటిల్ ఆడేందుకు యువతీ యువకులు ఆసక్తి చూపకపోవడంతో సచివాలయ సిబ్బందితోనే సరిపెట్టాల్సి వచ్చింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది క్రీడలను ఆడకూడదని కలెక్టర్ డా.జి.సృజన ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన సమావేశంలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బందితో క్రీడలను ఆడించారు.

నిబంధనలకు విరుద్ధంగా షటిల్ కోర్టు...

ప్రధానంగా షటిల్ ఆట అంటేనే ఇండోర్‌లో ఆడే ఆట. అయితే ఈ వైసీపీ ప్రభుత్వం షటిల్ ఆటను పూర్తిగా మార్చేసింది. బహిరంగ మైదానంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేసింది. ఆట ఆడే సమయంలో షటిల్‌కాక్ గాలికి ఎరిగిపోతుండడంతో క్రీడాకారులు విసుగు చెందే పరిస్థితి వచ్చింది. ఇలాంటి మైదానంలో షటిల్ టోర్నమెంటు ఎలా నిర్వహిస్తారని కొందరు క్రీడాకారులు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.

నగరంలో నాలుగు షటిల్ ఇండోర్ స్టేడియాలు ఉన్నాయి. పాత కంట్రోల్ రూమ్ వద్ద ఇండోర్ స్టేడియం ఔట్‌డోర్ స్టేడియం ఆధీనంలో, జొహరాపురం వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంది. బీ క్యాంపు మిలిటరీ క్యాంటీన్ వద్ద ఇండోర్ స్టేడియాన్ని ఆఫీసర్స్ నిర్వహిస్తున్నారు. వెంకటరమణ కాలనీలో కూడా ఓ ఇండోర్ స్టేడియం ఉంది. ఒక్కో స్టేడియంలో నాలుగు షటిల్ కోర్టులు ఉన్నాయి. కావాలంటే షటిల్ టోర్నమెంటు వీటిల్లో ఏర్పాటు చేయవచ్చు. అధికారులు తూతూమంత్రంగా క్రీడలు నిర్వహిస్తున్నారనడానికి షటిల్ పోటీలే నిదర్శనం.

ఒక్కో సచివాలయానికి రూ.10 వేలు

ఆడుదాం..ఆంధ్ర క్రీడలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.10 వేలు కేటాయించింది. దీంతో షామియానా, కుర్చీలు, క్రీడాకారులకు వాటర్, జ్యూస్ బాటిల్స్‌ను మాత్రమే సరఫరా చేయాలి. మిగిలిన క్రీడా సామగ్రి అంతా ప్రభుత్వమే అందజేసింది.

సచివాలయ సిబ్బందే క్రీడాకారులు

యువతీ,యువకులు క్రీడలు ఆడేందుకు ఆసక్తి చూపకపోవడంతో కొన్ని మైదానాల్లో సచివాలయ సిబ్బందే క్రీడలు ఆడారు. ప్రధానంగా ఖోఖో, షటిల్, టెన్నికాయిట్‌కు పెద్దగా స్పందన లేదు. కోల్స్ కళాశాల మైదానంలో క్రీడాకారులు లేకపోవడంతో వడ్డెగేరికి చెందిన కొందరు యువకులు షటిల్ బెట్టింగ్ ఆడారు. అక్కడే ఉన్న సచివాలయ సిబ్బంది ఏమి వారించకపోవడంతో చూస్తూ ఉండిపోయారు.



అసౌకర్యాల నడుమ షెటిల్ ఆడుతున్న యువకులు

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన కర్ణాటక మద్యంతో సెబ్ అధికారులు

కౌతాళం, జనవరి 18: మండలంలో గురువారం మెరుపు దాడులు చేసి కర్ణాటక అక్రమ మద్యంతో పాటు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు కర్నూలు సెబ్ డీటీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాథ్ తెలిపారు. మండల పరిధిలోని ఎరిగేరి-తోవి గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ఎరిగేరి గ్రామానికి చెందిన పశుల కేశవ స్వామి, పశుల భీమేష్ తమ ద్విచక్రవాహనాలపై 22 బాక్సుల(2112) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మద్యం బాక్సులతో పాటు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని బాపురం చెక్‌పోస్టు వద్ద ఆదోనికి చెందిన హనుమంతమ్మ వద్ద ఒక బాక్సు(96 ప్యాకెట్లు) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని కుంబళనూరు గ్రామం వద్ద అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఒక్కో ట్రాక్టర్‌పై రూ.10వేల జరిమానా విధిస్తూ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఆదోని సెబ్, కర్నూలు సెబ్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం, ఇసుకను తరలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జనవరి 18 : కర్ణాటక అక్రమ మద్యంపై సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కౌతాళం మండలంలో ఉన్న తోవి క్రాస్ వద్ద చేసిన దాడులలో ఎరిగేరి గ్రామానికి చెందిన కేశవ, భీమేష్ అనే వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై 22 కర్ణాటక బాక్సుల మద్యం రవాణా చేస్తుండగా గుర్తించి అరెస్టు చేశారు. అలాగే ఆదోని పట్టణానికి చెందిన హనుమంతమ్మ అనే మహిళ వద్ద 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరు, జనవరి 18: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కర్నూలు, నంద్యాలలో 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో 6120 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 11:30 గంటలకు పరీక్ష మొదలవుతుందని, 10:30 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 085212-29454,8074952380,9985738899లను సంప్రదించాలని కోరారు.

150 క్వింటాళ్ల మిర్చి దహనం

- రైతులకు రూ.30 లక్షల మేర నష్టం
- రాజకీయ కక్షలే కారణమంటున్న బాధితులు
- పరామర్శించిన మాజీ కేంద్ర సహాయ మంత్రి కోట్ల, గౌరు దంపతులు



వివరాలు తెలుసుకుంటున్న కోట్ల, గౌరు దంపతులు

కల్లూరు, జనవరి 18: కల్లూరు మండలం కొంగనపాడులో టీడీపీ సానుభూతిపరులైన రైతులు తెలుగు నాగయ్య, తెలుగు శ్రీనివాసులు మిరప దిగుబడి కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అన్నదమ్ములైన ఈ రైతులు పద్నాలుగు ఎకరాల్లో దాదాపు రూ.15 లక్షలు వెచ్చించి సాగు చేసిన పంట దిగుబడిని పొలంలో ఎండబెట్టారు. నాలుగు కుప్పలుగా ఏర్పాటు చేసి గుంటూరు మార్కెట్‌కు తరలించాలని అనుకున్నారు. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో భోజనం చేసేందుకు రైతులు ఇంటికి వచ్చిన సమయంలో దుండగులు మిరప కుప్పలకు నిప్పుపెట్టారు. రైతులు గుర్తించేలోపు మంటలు తీవ్రమై పంట కండ్ల ముందే కాలిపోయింది. అగ్నిమాపకశాఖ అధికారులు ఫైరింజన్లతో వచ్చి మంటలను అదుపుచేసే లోగా మిరపకాయలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి గురువారం బాధితులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ టీడీపీ సానుభూతిపరుల మిర్చిపంటను తగలబెట్టిన వారు ఎంతటివారైనా విడిచిపెట్టేది లేదని అన్నారు. రైతులను ఆర్థికంగా దెబ్బతీయాలనే ఈ దుర్మార్గానికి పాల్పడ్డారని అన్నారు. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కోలేని దద్దమ్మలు రైతుల పంటలను తగలబెట్టారని అన్నారు. దాదాపు 150 క్వింటాళ్ల మిర్చిపంటను కాల్చివేయడం నీచమైన పని అన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కోట్ల స్పష్టం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు డి. రామాంజనేయులు, దాకిటి మాదేష్, ఈవి. రమణ, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

దైవదర్శనం చేసుకొని వస్తుండగా ప్రమాదం

హొళగుంద, జనవరి 18 : హొళగుంద గ్రామ శివారులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పకు చెందిన ఈరమ్మ బైక్‌పై నుండి అదుపుతప్పి, కిందపడి తీవ్రగాయాలపాలైంది. భర్తతో కలిసి ఆమె ఎల్లార్తికి దైవదర్శనానికి వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా హొళగుంద గ్రామ శివారులో బైక్‌పై నుండి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో తలకు, చెవి వద్ద బలమైన గాయాలయ్యాయి. హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని, మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలించామని కుటుంబసభ్యులు తెలిపారు

గ్రూప్-1 అధికారిపై దాడి

కేసు నమోదు

కర్నూలు, జనవరి 18: గ్రూప్-1 అధికారి భరత్‌కుమార్ రెడ్డిపై బస్సులో ఇతర ప్రయాణికులు ఘర్షణ పడి దాడి చేసిన విషయంలో నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. భరత్ కుమార్ రెడ్డి సాంఘిక సంక్షేమ శాఖలో ట్రైనీ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. గురువారం కొత్తకోటకు వెళ్లి తిరిగి బస్సులో వస్తున్నారు. ముందర సీటులో ఉన్న ప్రయాణికుడు పవన్ ఒక్కసారిగా వెనక్కు తిరగడంతో ఇతని చేతిలో ఉన్న ల్యాప్‌ట్యాబ్ కింద పడి పగిలిపోయింది. ఈ విషయంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పవన్‌తోపాటు మరో ఇద్దరు కలిసి భరత్‌కుమార్ రెడ్డిపై దాడి చేశారు. దీంతో బాధితుడు బస్టాండులో దిగిన తర్వాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యం

చైర్‌పర్సన్ విజయ మనోహరి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 18: రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేద్దామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని పాతబస్తీ సహకార బ్యాంకు బ్రాంచి కార్యాలయంలో మహాజన సభ సమావేశం చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన అజెండా అంశాలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. బ్యాంకు ఉద్యోగులకు సంబంధించి నూతనంగా రూపొందించిన సర్వీసు నిబంధనలను ఆమోదించి వెంటనే అమలు చేసేందుకు పాలకవర్గం తీర్మానించింది. ఈ సందర్భంగా 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రస్తుతం జిల్లా సహకార బ్యాంకులో 23 బ్రాంచులు ఉన్నాయని, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవల సహకార బ్యాంకు ఐదు నూతన బ్రాంచులను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. నంద్యాల జిల్లాలో నేరేడుచెర్ల, ఎద్దుపెంట, యాలూరు, కొలిమిగుండ్ల, నందవరం ప్రాంతాల్లో త్వరలోనే సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచులను ఏర్పాటు చేయాలని పాలక వర్గం నిర్ణయించిందని చెప్పారు. అనంతరం పగిడ్యాల సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డిని సీఈవోతో పాటు నందికొట్కూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సరోజమ్మను ఘనంగా సన్మానించారు. మహాజన సభ సమావేశంలో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు గుండం సూర్యప్రకాష్ రెడ్డి, వెంకటేశ్వరమ్మ, సీమ సుధాకర్ రెడ్డి, మూలింటి రాఘవేంద్ర, డీసీవో రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, బ్యాంకు సీఈవో రామాంజనేయులు, ఆప్కాబ్ జీఎం విజయకుమార్, డీపీడీఎం నహీదా సుల్తానా పాల్గొన్నారు.

పత్తి ధర మరింత పతనం

క్వింటం గరిష్ఠంగా రూ.6899



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 18 : పత్తి ధరలు మరింత పతనమయ్యాయి. గురువారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధర గరిష్ఠంగా క్వింటం రూ.6899 పలికాయి. వారం రోజుల్లో క్వింటానికి పత్తి ధర రూ.300 తగ్గింది. పంట చేతికి వచ్చినప్పుడు నుండి ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. ఉన్న ధరలు సైతం పతనమవుతుండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. అసలే వర్షాభావం వల్ల దిగుబడి లేక అవస్థ పడుతుంటే, చేతికి వచ్చిన పంటకు కూడా ధరలు తగ్గిపోయాయని, దీంతో అప్పుల్లో కురుకుపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగుమతులు నిలిచిపోవడంతోనే ధరలు పతనమయ్యాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. 2350 క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5,216 గరిష్ఠ ధర 6,899 మధ్యస్థ ధర రూ.7,135 పలికింది.

వ్యక్తి ఆత్మహత్య

గూడూరు, జనవరి 18: కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు టౌన్ కల్లూరు ఎస్టేట్ చింతలముని నగర్‌కు చెందిన మధు శేఖర్(56) ఆర్థిక ఇబ్బందుల కారణంగా కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దపాడు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమ్లానాయక్, ఏఎస్ఐ ఫైజుల్లా ఖాన్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కుతురు ఉన్నట్లు తెలిపారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

సంజామల జనవరి 18: సంజామల మండలంలోని పేరుసోమల గ్రామంలో గురువారం వైసీపీ నాయకుడి ప్రోద్బలంతో టీడీపీ కార్యకర్తలపై దాడి జరిగింది. సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన అబ్రహాం 5 సెంట్ల స్థలాన్ని గతంలో కొన్నాడు. అయితే వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీ స్థానిక నాయకుడి అండదండలతో అందులో అక్రమ నిర్మాణం చేపట్టారు. దీన్ని అడ్డుకున్న అబ్రహాం, ఆయన భార్య మమత, అక్క పారక్కలపై వైసీపీ వర్గీయులైన పుష్పరాజు, జ్యోతి, ప్రకాశం, రత్నం, ఓబులేసు, పెద్దఐజయ్య, సుమిత్ర, మధుచందు, విజయ్, నీలమ్మ, శాంతమ్మ, ఆనందరావు దాడి చేశారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోవెలకుంట్ల సీఐ రామాంజులుకు బాధితులు ఫిర్యాదు చేశారు. సీఐ రామాంజులు విచారణ చేస్తున్నారు.

కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 18 : కుల గణన సర్వేకు ప్రజల సహకరించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని సీపీవో హిమప్రభాకర్ రాజు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సీపీవో చాంబర్‌లో కులగణన సర్వేపై మీడియా ప్రతినిధులతో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ కుల గణన సర్వే ఆధారంగా సంక్షేమ పథకాల అమలు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ వంటివి ఏమి ఉండవని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌ల ద్వారా జనవరి 28 వరకు కుల గణన సర్వే జరుగుతుందన్నారు. సర్వే చేయించుకునేందుకు ఫిబ్రవరి 2 వరకు చివరి అవకాశం ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి వెరిఫికేషన్ చేసి ఫైల్ చేస్తామని అన్నారు. జిల్లాలో 10,395 మంది ఎన్యూమరేటర్లు, 2,787 మంది సూపర్‌వైజర్లను నియమించి శిక్షణ ఇచ్చామని చెప్పారు.

గురు తెలియని వ్యక్తి ఆత్మహత్య



బనగానపల్లె, జనవరి 18: మండలంలోని నందవరం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి కానుగచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు గురువారం తెలిపారు. ఇతనికి సుమారు 60 ఏళ్లు ఉండవచ్చని, టోపీ ధరించి ఉన్నాడని తెలిపారు. ముస్లిం కుటుంబానికి చెందిన వ్యక్తి అన్నారు. సదరు వ్యక్తి అప్పుడప్పుడు నందవరం గ్రామానికి వచ్చేవాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. తనది గిద్దలూరు అని ఆటో డ్రైవర్లకు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడ్ని గుర్తుపట్టినవారు 9121101098, 9121101123 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుడ్లు, చిక్కీలు సరఫరా చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 18: సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 22న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని సంబంధిత ఏజెన్సీ వారు గుడ్లు, చిక్కీలను సెలవు రోజుల్లో కూడా పాఠశాలలకు సరఫరా చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి గురువారం ఆదేశించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విధిగా ఏజెన్సీ వారి నుంచి గుడ్లు, చిక్కీలు తీసుకోవాలని అన్నారు. వాటిని తీసుకున్న వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులు వారి ఐఎంఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేసి పాఠశాలల పునఃప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు అందజేయాలన్నారు. పాఠశాలలు తెరిచిన అనంతరం గుడ్లు, చిక్కీలు విద్యార్థులకు పంపిణీ చేయకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 18: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది.

లారీ బైక్ ఢీ- వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, జనవరి 18: కోవెలకుంట్ల మండలంలోని అమడాల మెట్ట వద్ద లారీ-బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. అమడాల గ్రామానికి చెందిన నిచ్చెనమెట్ల మద్దిలేటి (65) అమడాల మెట్ట వద్ద ఉన్న కాశీనాయన ఆశ్రమం నుంచి తిరిగి గ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా కోవెలకుంట్ల నుంచి సిమెంట్ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మద్దిలేటి టైరు కింద పడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మద్దిలేటి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించడానికి కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సైకో జగన్‌ను సాగనంపుదాం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు

నంద్యాల టౌన్, జనవరి 18: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసిన సైకో సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జే.లక్ష్మి నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా, నియోజకవర్గాల అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల పేరుతో, మతాల పేరుతో విడదీసి రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలనుకుంటున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ఉద్దేశించిన కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా వైసీపీ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. ఈనెల 21వ తేదీన విజయవాడలో నూతన పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు స్వీకరిస్తారని, ప్రమాణ స్వీకారోత్సవానికి వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆహ్వానితుడిగా నియమితుడైన గిడుగు రుద్రరాజు జన్మదినం సందర్భంగా డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఇదిలా ఉండగా నంద్యాల, ఆళ్ళగడ్డకు చెందిన పలువురిని డీసీసీ అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు



కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్రః 7075656208

AJV_164648

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647

AJA- 150690

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



నరసింహయ్య కృషి చిరస్మరణీయం



నరసింహయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, జనవరి 18: కమ్యూనిస్టు ఉద్యమానికి దివంగత తెలకపల్లి నరసింహయ్య చేసిన కృషి చిరస్మరణీయమని సీపీఎం నాయకులు ఏ.రాజశేఖర్, ఏసురత్నం అన్నారు. గురువారం స్థానిక సుదర్శనవర్మ భవన్‌లో నరసింహయ్య ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం కరువుకాటకాలతో అవస్థలు పడే కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నరసింహయ్య అనేక పోరాటాలు సాగించారని గుర్తుచేసుకున్నారు. బాల్యం నుంచి తుదిశ్వాస వదిలే వరకు దళితులు, గిరిజనులు, వెనకబడి తరగతులు, మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఆ పార్టీ నాయకులు రణధీర్, నరసింహానాయక్, రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, గణపతి, సుధాకర్, మహ్మద్‌రవి, రవీంద్ర, మల్లయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కంది కొనుగోళ్లు ప్రారంభం

ఆత్మకూరు, జనవరి 18: కంది సాగుచేసిన రైతులు దిగుబడులను శుక్రవారం నుంచి ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో నాఫెడ్ సహకారంతో విక్రయించే వెసులుబాటు కల్పిస్తున్నట్లు డీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ నవీన్ గురువారం తెలిపారు. వివరాలకు 9000889639 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆత్మకూరు, జనవరి 18: ఆత్మకూరు పట్టణంలోని 20వ వార్డులోని తోటగేరిలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ శ్రీనివాసరావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత ప్రకారం వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. వార్డు కౌన్సిలర్ పాణ్యం పార్వతీ ఉన్నారు.

విత్తన శుద్ధి కేంద్రాలలో విజిలెన్స్ తనిఖీలు

నంద్యాల టౌన్, జనవరి 18: నంద్యాల పరిధిలో పలు విత్తన శుద్ధి కేంద్రాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. గురువారం విజిలెన్స్ విభాగం వ్యవసాయాధికారి రూఫస్, సీఐలు కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డిలతో పాటు మండల ఏవో ప్రసాదరావులు పత్తి విత్తన శుద్ధి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రావణ లక్ష్మి సీడ్స్, ఆర్‌కే సీడ్స్ ఆగ్రో ఇండస్ట్రీస్, తదితర కేంద్రాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని ఆదేశించారు. శ్రావణ లక్ష్మి సీడ్స్ విత్తన శుద్ధి కేంద్రంలో 6 లాట్లల్లో కాటన్ స్ట్రిప్ టెస్ట్ నిర్వహించగా ఇందులో హెచ్‌టీ నెగిటివ్ వచ్చింది.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 18: కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు 49వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ జూనియర్స్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఏ.పిచ్చిరెడ్డి తెలిపారు. గురువారం నంద్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మావతినగర్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియం ఆవరణంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాల, బాలికల కబడ్డీ జట్లు పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 450 మంది క్రీడాకారులు, 100 మంది అఫిషియల్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమణారెడ్డి, సంఘం జాయింట్ సెక్రటరీ సుబ్రమణ్యం, వైస్ ప్రసిడెంట్లు నాగరాజు, రామేశ్వరరెడ్డి, సురేష్ నాయుడు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

కొత్తపల్లి, జనవరి 18: మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సమావేశాలకు హాజరు కాకపోతే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎవరితో చెప్పుకోవాలి. వాటి పరిష్కారానికి ఎవరు చొరవ చూపుతారు' అంటూ ఎంపీడీవో మేరీని ఎర్రమటం సర్పంచు బాల యల్లయ్య, కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యులు ఆలిబాషా ప్రశ్నించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎర్రమటం బాల ఎల్లయ్య మాట్లాడారు. 'పీహెచ్‌సీ వైద్యాధికారులు తరుచూ విధులకు గైర్హాజరవుతున్నారు. వైద్యసేవలు అందడం లేదు. సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేపీఎల్ టోర్నీ విజేత సున్నిపెంట జట్టు

ఆత్మకూరు, జనవరి 18: సంక్రాంతి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 9వ తేది నుంచి ప్రారంభమైన కార్తీక్ ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) టోర్నీ క్రీడలు గురువారానికి ముగిశాయి. ఈ క్రీడల్లో టోర్నీ విజేతగా సున్నిపెంట జట్టు నిలిచి రూ.లక్ష, 2,3,4వ స్థానాల్లో నిలిచిన ఆత్మకూరు పట్టణానికి చెందిన మహ్మద్ లగాన్ జట్టు రూ.50వేలు, జూనియర్ లెజెండ్ జట్టు రూ.20వేలు, మహానంది మండలంలోని మసీదుపురం జట్టు రూ.10వేలు దక్కించుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

సునీత(ఫైల్)

శ్రీశైలం, జనవరి 18: శ్రీశైలానికి చెందిన పి.సునీత(26) హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ భరత్‌నగర్ ఫ్లైఓవర్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. శ్రీశైలంలోని అన్నదాన సత్రం బ్యాక్‌సైడ్ పాల వ్యాపారం చేస్తూ జీవిస్తున్న పి.వెంకటేశ్వరుకు సునీత నాలుగవ సంతానం. ఈమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగానికి స్కూటీపై వెళ్తున్న సమయంలో వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొనడంతో పక్కగా వస్తున్న బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది.

రైతు సమస్యలపై బీజేపీ ధర్నా

నంద్యాల (కల్చరల్), జనవరి 18: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. గురువారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, కిసాన్ మెర్చా అధ్యక్షులు తాడి రామక్రిష్ణారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర రథసారధి చిగురుపాటి కుమారస్వామి తదితరులు ప్రసంగించారు.

PUBLIC NOTICE

UNDER The instruction of my clint M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general Public. My clintes intends to grant loan to **Sri. Molla Mudassar, S/o. Sri. Molla Chinna Vali, H.No. 87/1109-A-19G, Ganesh Nagar, Kallur, Kurnool,** by keeping the below mentioned of property of him as security by way of Registered Mortgage. As such if any one have any claim, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing with in 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my clint in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is residential house plot in Sy.No.428 of Lakshmapuram, with in Sub Registration office of Nandikotkur and Dist. Registration office of Kurnool and bounded as follows.
East : Public Rastha, **West** : House of S.Pedda Allabakash,
North : House of Chinna Allabakash,
South : Site of Ramachandrudu.
Extent : 76.5 Sq.Yards

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

ఎన్టీఆర్ భావితరాలకు స్ఫూర్తిదాయకం





నంద్యాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మల్లెల రాజశేఖర్, ఫరూక్, నందికొట్కూరులో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు, వెలుగోడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాయకుల నివాళి

- వాడవాడలా ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాలు
- ప్రాంతీయ పార్టీల సత్తా చాటిన ఘనత ఎన్టీఆర్‌దే
- తెలుగుగంగతో నంద్యాల ప్రాంతం సస్యశ్యామలం : ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు సినీ, రాజకీయ ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాలను ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు జిల్లా వ్యాప్తంగా వాడవాడలా నిర్వహించి ఘన నివాళి అర్పించారు. నంద్యాల ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయం నుంచి జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదర్శి రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, జిల్లెల శ్రీరాములు, తాతిరెడ్డి తులసిరెడ్డి, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాససెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ దేశానికి ప్రాంతీయ పార్టీల సత్తాను చాటిన వ్యక్తి ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో చక్కెర, వక్ఫ్‌బోర్డు శాఖ మంత్రిగా తనకు అవకాశం కల్పించి మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారని కొనియాడారు. తెలుగుగంగ ప్రాజెక్టును చేపట్టి కృష్ణా జలాలను చెన్నై నగరానికి తరలిస్తూనే నంద్యాలతోపాటు సరిహద్దు జిల్లాల అభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. చంద్రబాబు నేతృత్వంలో ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు: ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఖలీల్ థియేటర్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏవీ సుబ్బారెడ్డి, ఫరూక్, తదితరులు ప్రారంభించారు. టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జైనాబీ, కౌన్సిలర్లు శ్రీదేవి, నాగార్జున, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కలీల్, మాజీ కౌన్సిలర్లు మిద్దె చిన్న హుసేని, శివశంకర్, కృపాకర్, దస్తగిరి, అజ్మీర్, గోస్పాడు మండల నాయకులు ఒంటివెలగల భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, విశ్వనాథ్‌రెడ్డి, జయసింహారెడ్డి, నంద్యాల మండల నాయకులు పుసులూరు ప్రసాద్‌రెడ్డి, త్రిలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. భూమా నివాసం నుంచి బైక్ ర్యాలీగా ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

రాష్ట్రానికి మంచి రోజులు : మాండ్ర

నందికొట్కూరు : రాబోయే కాలంలో రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని టీడీపీ, బాలకృష్ణ అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శివానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. మిడ్తూరు, పగిడ్యాల జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల కన్వీనర్ల ఆధ్వర్యంలో యువత, టీడీపీ నాయకులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, ఖాతారమేష్‌రెడ్డి, పలచాని మహేశ్వర్‌రెడ్డి, వీరం ప్రసాద్‌రెడ్డి, గుండం రమణారెడ్డి, గిరీశ్వర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, చిన్న వెంకటస్వామి, జయసూర్య, ముర్తుజావలి, షకీల్ అహ్మద్, మండ్లెం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

ఆత్మకూరు : రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు ఆద్యుడు దివంగత నందమూరి తారకరామారావేనని శ్రీశైలం నియోజకర్గ టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మాజీ సర్పంచు కంచర్ల గోవిందరెడ్డి అన్నారు. ఆత్మకూరు గౌడ్‌సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి అన్నదానం చేశారు. టీడీపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా తెలుగు తమ్ముళ్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ వెంకటరాముడు, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, కలిముల్లా, రాజారెడ్డి, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, ఫక్రుద్దిన్, శివశంకరశర్మ, కొప్పరపు రవిప్రసాద్, నబిరసూల్, మురళీ, రామనర్సయ్య, మోహన్, శ్రీరామ్‌రెడ్డి, నందమూరి అభిమానులు పాణ్యం కిష్టయ్య, తోట శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్ తన స్వగృహంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఘననివాళి అర్పించారు.

ఆంధ్రుల గుండెల్లో సుస్థిర స్థానం

పాణ్యం : పేద బడుగు వర్గాల సంక్షమమేధ్యేయంగా కృషి చేసి ఆంధ్రుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి అన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కన్వీనర్ జయరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, ఖాదర్‌బాషా, జనసేన నాయకులు జగదీశ్, అడ్వకేట్ విజయకుమార్, మహేష్, ఖాజ, సుబ్బయ్య, సుబ్బక్రిష్ణ, నాగశేషుడు, రామయ్య, కృష్ణ, రాంమోహన్‌నాయుడు, ఎంపీటీసీ రంగరమేష్, దానం, ప్రభాకర్, దుబాయ్ శీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : టీడీపీ మండల నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కర్నాటి శివారెడ్డి, నాగేషన్న, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక భ్రమరాంబ చెంచుగూడెంలో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గూడెం చెంచులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ముందు గత 36 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి పండ్లు, బిస్కట్లు అందజేశారు. నాయకులు చిన్నపుల్లారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, పోత నారాయణ, చిన్నపుల్లన్న, శ్రీనివాస నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: టీడీపీ మండల సీనియర్ నాయకుడు కంచర్ల మనోహర్‌చౌదరి, జాకీర్, తోట శివయ్య ఆధ్వర్యంలో నారాయణపురం, వెగళరెడ్డిపేట, పెద్దదేవళాపురం, బండిఆత్మకూరు, ఈర్నపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సర్పంచు రామచంద్రుడు, సిద్దయ్య, లక్ష్మిరెడ్డి, నందయ్య, రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

పగిడ్యాల : పడమర ప్రాతకోట గ్రామంలో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామరావు వర్ధతిని టీడీపీ నాయకులు నాగేషులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. నాయకులు మిద్దె బాబు, పెద్దముని, నాగేశ్వరరావు, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: టీడీపీ మండల నాయకులు గడ్డం నాగపుల్లయ్య, కంచెర్ల శివ, నరాల మౌళీశ్వరరెడ్డి, మారెడ్డి సుబ్రమాణ్యం, సూరే శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహానంది సమీపం లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు జనార్ధన్‌రెడ్డి, కాకర్ల శివ, నందిపల్లి మహేశ్వరరెడ్డి. సీహెచ్ రాముడు పాల్గొన్నారు.

గడివేముల: పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో దుర్వేసి గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

వెలుగోడు : పట్టణ శివారులోని రిజర్వాయురు వద్దగల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు ఖలీల్‌ఖాన్, మైనార్టీ నాయకలు మోమిన్ రసూల్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, రఘుస్వామిరెడ్డి, పాల శంకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ఆసర్ ఫజీర్, రవి, మజీద్‌ఖాన్, నాగశేఖర్, కులాయప్ప, రమణ, శివన్న, చంద్ర, లింగమయ్యగౌడ్, తెలుగు బుడ్డన్న, బంకుశీను, సరఫరాజ్, రాజచారి, వాసం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



పాణ్యంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



బండిఆత్మకూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



ఆత్మకూరులో నివాళి అర్పిస్తున్న మోమిన్ అహ్మద్



ఆత్మకూరులో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు





మహానందిలో ఎన్టీఆర్ విగ్రహానికి, దుర్వేసి, పగిడ్యాలలో ఎన్టీఆర్ చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి

- ఆత్మకూరుకు చేరిన బీసీల స్వాతంత్ర్య పోరాట రథయాత్ర

ఆత్మకూరు, జనవరి 18: బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావుయాదవ్, జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. గురువారం బీసీల రాజ్యాధికారం కోసం చేపట్టి మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర గురువారం ఆత్మకూరు పట్టణానికి చేరుకుంది. ముందుగా నంద్యాల టర్నింగ్‌కు చేరుకున్న రథయాత్ర గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్ మీదుగా సంగమేశ్వరం సర్కిల్ వద్దకు చేరుకుంది. అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు బీసీ సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బీసీల్లో మార్పు రాకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 90ఎమ్మెల్యే, 13ఎంపీ సీట్లను అన్ని రాజకీయ పార్టీలు కేటాయించకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలకు సబ్ కోటా కేటాయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లను కేటాయించాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి బీసీలపై దాడులు జరగకుండా రక్షణ చట్టాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు. నాయకులు రాంబాబు, వెంకటేష్, రఘురాముడుయాదవ్, బాలస్వామియాదవ్, రామకృష్ణ, శ్రీహరి, వీరన్న, తిమ్మయ్య, శివ ఉన్నారు.

పాములపాడు : రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీసీలకు యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. పాములపాడులో బీసీ సంక్షేమసంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్ గోపాల్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఫిబ్రవరి నాలుగున తిరుమలలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని అనంతరం ఈ యాత్ర ముగుస్తుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సీపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై ప్రాథమిక సమావేశం

శ్రీశైలం, జనవరి 18: శ్రీశైలం మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రాథమిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. విభాగాధిపతులతో చర్చించి పలు సూచనలు జారీ చేశారు.

పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించండి : కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జనవరి 18: ఈ నెల 22వ తేదీ ప్రచురితమయ్యే తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ నియోజక వర్గ ఈఆర్వోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎలక్ట్రోరల్‌రోల్, పోలింగ్‌స్టేషన్లలో మౌలిక వసతులు, జాతీయ ఓటర్ల దినోత్సవ ఏర్పాట్లు, ఎన్నికల సన్నద్ధత, పోలింగ్ అధికారులకు శిక్షణ తదితర అంశాలపై జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తో కలిసి సమీక్ష నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎన్నికలకు సంబంధించిన అన్ని కమిటీల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పేదలందరికీ ఇళ్లు' కింద రూ.84.44 లక్షల వడ్డీ లబ్ధి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో 10,760 మంది లబ్ధిదారులకు గాను రూ.84.44 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేకూర్చామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధి జమచేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌నుంచి కలెక్టర్ , హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, అధికారులు లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ జంబో చెక్కును పంపిణీచేశారు.

నదిలో ఇంజన్‌బోట్లు నడపొద్దు

పగిడ్యాల : తెలంగాణ వనపర్తి మండలంలోని సింగోటం లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం సందర్భంగా కృష్ణనదిలో ఇంజన్‌బోటు నడపరాదని ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ హెచ్చరించారు. మండల పరిధిలోని నెహ్రూనగర్ సమీపంలోని నదీతీర ప్రాతంలో ఉన్న మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌లను గురువారం ఆయన పరిశీలించారు.

వైసీపీ పాలనలో మోయలేని భారాలు

రాష్ట్రాభివృద్ధి బాబుతోనే సాధ్యం: మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత

గడివేముల, జనవరి 18: వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలపై మోయలేని భారాలు మోపారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు గౌరుచరిత అన్నారు. మండలంలోని పెసరవాయి గ్రామంలో గురువారం ఆమె బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవినీతి, అసమర్థ పాలనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అంధకారంగా మార్చారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేపడతామని అన్నారు. వెలగమాను ఫీడర్ చానల్ నిర్మిస్తామని అన్నారు. గడివేములలో బైపాస్‌రోడ్డు వేయిస్తామని అన్నారు. దివంగత నేత వడ్డు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డు లక్ష్మీదేవి, వడ్డు ప్రశాంతి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రఫిక్, రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గని హర్ష, దిలిప్‌కుమార్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రంగస్వామినాయక్, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, సుభద్రమ్మ ఉన్నారు.



పెసరవాయిలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత

వైసీపీ నేత బాలీశ్వరరెడ్డి టీడీపీలో చేరిక

పెసరవాయి గ్రామ వైసీపీ నాయకుడు బాలిశ్వర్‌రెడ్డి, అతడి అనుచరులు మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత సమక్షంలో టీడీపీలో చేరారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలు కష్టాలు పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పడం ఖాయమని బాలిశ్వర్‌రెడ్డి అన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం

పాములపాడు : రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజర్ జయసూర్య అన్నారు. తుమ్మలూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యేసేపు, ఇబ్రహీం, అలీసాహెబ్, జనార్దన్, రామక్రిష్ణ, బండశేఖర్, తిమ్మారెడ్డి, మధుక్రిష్ణ, గోవిందు, ఆదిరెడ్డి, పూసలక్రిష్ణ, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



గౌరుచరిత సమక్షంలో టీడీపీలో చేరిన బాలీశ్వరరెడ్డి, అనుచరులు

కొండంపల్లెలో అహోబిలేశుడికి పూజలు



కొండంపల్లెలో పూజలు చేస్తున్న గ్రామస్థులు

ఆళ్లగడ్డ, జనవరి 18: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ గురువారం ఆళ్లగడ్డ మండలంలోని కొండంపల్లెకు చేరుకుంది. గ్రామంలోని తెలుపుల వద్ద ఉత్సవ పల్లకీ విడిది చేయడంతో ప్రజలు ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, జ్వాలా నరసింహస్వాములు పూజలందుకున్నారు. ఉత్సవ పల్లకీకి గ్రామంలోని పెద్దలు పూజలు చేశారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురం గ్రామంలో అహోబిలేశుడు పూజలు అందుకోనున్నారు.

వైసీపీకి మర్రి గోవిందరాజు రాజీనామా



డోన్, జనవరి 18: డోన్ నియోజకవర్గంలో అధికార పార్టీకి షాక్ తగిలింది. ఏపీఐఐసీ డైరెక్టర్, వైసీపీ నాయకుడు మర్రి గోవిందరాజు పార్టీకి రాజీనామా చేశారు. ఆ మేరకు గురువారం మర్రి గోవిందరాజు ప్రకటన విడుదల చేశారు. డోన్ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన మర్రి గోవిందరాజుకు మంచి పట్టు ఉంది. మర్రి గోవిందరాజు తండ్రి మర్రి రాఘవయ్య ఎన్ఎఫ్ఐఆర్ (భారతీయ రైల్వే) జనరల్ సెక్రటరీగా పని చేస్తున్నారు. ప్రజారాజ్యం పార్టీ తరుపున మర్రి గోవిందరాజు 2009 అసెంబ్లీ ఎన్నికల్లో డోన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. అయితే గత ఎన్నికల ముందు మర్రి గోవిందరాజు వైసీపీలో చేరారు. ఏపీఐఐసీ డైరెక్టర్ పదవిలో ఉన్న మర్రి గోవిందరాజు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైసీపీలో ఎలాంటి గుర్తింపు లేదని, తమ వెంట ఉండే కార్యకర్తలకు ఎలాంటి న్యాయం చేయలేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు గోవిందరాజు ఆంధ్రజ్యోతికి తెలిపారు. తమ అనుచరులు, అభిమానుల నిర్ణయాన్ని బట్టి భవిష్యత్తు ప్రణాళిక ఉంటుందని ఆయన తెలిపారు.

బీసీ ఇందిరమ్మ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జనవరి 18: పట్టణంలోని టీడీపీ వాణిజ్య విభాగం నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య కార్యాలయంలో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బచ్చు భాస్కర్, యాగంటిపల్లె దస్తగిరి, మీరాపురం భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి లాయర్ నాగేంద్రారెడ్డి, ఖాదర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో బీసీ ఇందిరమ్మ జన్మదినం సందర్భంగా వృద్ధులచే కేక్ కట్ చేయించి వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సలాం, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

వధువుకు పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక పంపిణీ చేస్తున్న పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జనవరి 18: బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో గురువారం పేద వధువుకు పెళ్లి కానుక పంపిణీ చేశారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ పేదలు వివాహం చేసుకుంటే వధువుకు పెళ్లి కానుకలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలు ఎవరైనా పెళ్లిళ్లు చేసుకుంటే అలాంటి పెళ్లికానుకలు అందిస్తున్నానని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని బీసీ రాజారెడ్డి కోరారు.

ప్రహరీకి మరమ్మతులు



కూలిన ప్రహరీని నిర్మిస్తున్న కూలీలు

రుద్రవరం, జనవరి 18: మండలంలోని యల్లావత్తుల ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ కూలింది.. అనే శీర్షిక ఈ నెల 1వ తేదీన ప్రచురితమైంది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్పందించారు. గురువారం కూలిన ప్రహరీకి మరమ్మతులు చేయిస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చాగలమర్రి, జనవరి 18: గ్రామాల్లో విద్యార్థులు విద్యవల్ల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. గురువారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో గ్రామాల అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో గ్రామాల అభివృద్ధిపై ప్రణాళిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ గ్రామాల్లో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జీఈఆర్ సర్వే వంద శాతం సాధించాలని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, కార్యదర్శి స్వర్ణకుమార్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

చాగలమర్రి, జనవరి 18: మండలంలోని డి.వనిపెంట, గొడిగనూరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమక్షంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సాయిబాబా మాట్లాడుతూ గ్రామాల్లో మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా, సుకన్య సమృద్ధి, బాలికల బంగారు భవితవ్యం గురించి వివరించారు. 26వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సంకల్ప యాత్ర కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ శంకరాబాయి, ఏవో రంగనేతాజీ, పోస్టల్ ఉద్యోగి భాస్కర్‌రావు, వైద్యశాఖ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రాజశేఖర్, ఎఫ్ఏ మురళి పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

- 28వ వర్ధంతిని నిర్వహించిన టీడీపీ నాయకులు
- రక్తదాన శిబిరం ఏర్పాటు
- సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు



ప్యాపిలిలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు



చాగలమర్రిలో..



బనగానపల్లెలో నివాళి అర్పిస్తున్న బీసీ రామనాథరెడ్డి

డోన్, జనవరి 18: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున, యువ నాయకులు ధర్మవరం గౌతమ్‌రెడ్డి, భరత్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో రక్తదన శిబిరం నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో యుగపురుషుడుగా నిలిచిపోయారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్టీ హరున్, అజీజ్, చక్రపాణిగౌడు, మిద్దెపల్లి గోవిందు, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, ఎస్ఎండీ రఫి, కుమ్మరి సుధాకర్, మధుసూదన్ రెడ్డి, ఎల్ఐసీ శ్రీరాములు, కొచ్చెర్వు రామాంజనేయులు, హుశేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని పట్టణంలో నిర్వహించారు. ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు జె.చంద్రశేఖర్, హుశేన్‌పీరా, నగేష్, నాగరత్నం, రాముడు, సిమెంటు మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో పోలూరు బ్రదర్స్ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. అనంతరం టీడీపీ ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల సమన్వయ కమిటి చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, ఉన్నం సుధాకర్, గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేష్ చౌదరి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం చాటిన మహనీయుడు ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన నేటికి తెలుగువారి గుండెల్లో బ్రతికే ఉన్నారని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక పాతబస్టాండులో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని టీడీపీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపి ఉన్నం చంద్రశేఖర్ సహకారంతో తేనేటి విందు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేకల నాగరాజు, జాకీరుల్లాబేగ్, రవీంద్రనాయక్, రూబెన్, కౌన్సిలర్లు రామాంజనేయులు, రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, జావాజి వెంకటేశ్వర్లు, రమేష్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీధర్, సిమెంట్‌నగర్ రాముడు, గూటం శివ, సిమెంటునగర్ వాసు, మల్లెపెద్ది నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్, జగదీష్, జనార్దన్, కానాల అంజి, సుంకన్న, నాగరాజు, శ్రీపతి నాగరాజు, దూదేకుల దస్తగిరి, బాషా పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఈ రాఘవేంద్ర, చిన్న సుంకయ్య, గండికోట రామసుబ్బయ్య, పి వెంకటేశ్వరరెడ్డి, రామ్మోహన్‌యాదవ్, సుదర్శన్, ఎస్ మధు, చల్లా వీరాంజనేయులు, నాగేంద్ర, గండకోట పెద్దరామాంజి నేయలు, కలచట్ల ప్రసాద్, రాంపురం నాగేశ్వరరావు, ఏనుగమర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహనీయుడని మాజీ మంత్రి అఖిలప్రియ కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురష్కరించుకొని పట్టణంలోని ఆమె స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆమె రక్తదానం చేశారు. కార్యక్రమంలో తాలుకాలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు.



కొలిమిగుండ్లలో..

శిరివెళ్ల: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, గోవిందపల్లె, బోయలకుంట్ల తదితర గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి, కమతం లక్ష్మిరెడ్డి, మండ్ల హుసేనప్ప, తాళ్లూరి బుగ్గన్న, తపసి పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మౌళాలి, అష్రఫ్, ఓబులేసు, కమతం జయరామిరెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, కమతం సుబ్బారెడ్డి, జాకీర్ హుసేన్, జమాల్ బాషా, శీలం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సేవలు చిరస్మరణీయమని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. గురువారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, బషీర్, అబ్దుల్, ఓబులేసు, టైలర్ మాబాషా, చోటు, దస్తగిరి, సుబ్బరాయుడు, కె.రమేష్ పాల్గొన్నారు.



అవుకులో..

ఉయ్యాలవాడ: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారకరామారావు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, మండల కన్వీనరు కూడాల నారాయణరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఉయ్యాలవాడలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడన్నారు. మండల టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎ.నరసింహుడు, ఆకుల వెంకటసుబ్బయ్య, ఉప్పరవీధి వెంకటేశ్వర్లు, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో..

బనగానపల్లె: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీరామారావు వర్ధంతిని బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బీసీ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి బీసీ రామనాథరెడ్డితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నందమూరి అభిమానులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 260 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. బీసీ రామనాథరెడ్డి మాట్లాడుతూ రక్తదానంచేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్తదాతలను అభినందించారు. మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, బనగానపల్లె ఉప సర్పంచ్ బురానుద్దీన్, రామకృష్ణాపురం శంకర్, ఉగ్రసేనారెడ్డి, బొబ్బల గోపాల్‌రెడ్డి, భూషన్న, కృష్ణానాయక్, మౌలాలి, కాశీంబాషా, సలాం, పక్కీర్‌రెడ్డి, అల్తాఫ్‌హుసేన్, మౌలాలి, టంగుటూరు శ్రీనయ్య, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, కలాం, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, శేషారెడ్డి, ప్రసాద్, బాలనాయుడు, బాస్కర్‌రెడ్డి, లాయర్ నాగేంద్రారెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.



బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పార్టీ మండల ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాలు, మహిళలు, రైతులు వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి అధికారంలోకి వచ్చి సుపరిపాలన అందించారన్నారు. నాయకులు పీసీ చెన్నారెడ్డి, వి.రామచంద్రారెడ్డి, తోట శివారెడ్డి, వైసి కళ్యాణ్‌రెడ్డి, వి.నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, టైలర్ వెంకటరాముడు, మండ గోపాల్, దుర్గార్జున్, వెంకటరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

అవుకు: అవుకులోని టీడీపీ కార్యాలయంలో దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. అవుకు మండల నాయకులు దంతెల రమణ, వెంకటరాముడునాయక్, తిక్కన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి తెలుగుజాతి ఖ్యాతిని నలుమూలల చాటారన్నారు. నాయకులు జగన్, ఓబులేసు, ఈశ్వరయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పేదల గుండె చప్పుడు ఎన్టీఆర్ అని తెలుగుయువత నియోజవకర్గఅధ్యక్షుడు రుచిహోటల్ మద్దిలేటి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి అన్నారు. గురువారం కోవెలకుంట్లప ట్టణంలోని టీడీపీ కార్యాలయంలో దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డోన్(రూరల్): డోన్ పట్టణంలో..



శిరివెళ్ల: యర్రగుంట్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు



కోవెలకుంట్లలో..

పేరూరు సందర్శన

రుద్రవరం, జనవరి 18: మండలంలోని పేరూరు గ్రామాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య గురువారం సందర్శించారు. ఎస్సీ, ఎస్టీ కేసులో బాధితులను విచారించారు. గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో ఎలాంటి అలజడులు జరగకూడదని గ్రామ ప్రజలకు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

చాగలమర్రి, జనవరి 18: మండలంలోని శెట్టివీడు గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పశువైద్యాధికారి సాయిబాబా తెలిపారు. గురువారం ఇంటింటికి వెళ్లి ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని అన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు జమాల్‌బాషా, గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

'వ్యవసాయంపై అవగాహన ఉండాలి'

బనగానపల్లె, జనవరి 18: విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కల్గి ఉండాలని కేవీకే సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి కోరారు. గురువారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కలాశాల విద్యార్థులు ప్రదర్శించిన నీటి సంరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పట్టు పురుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, మిద్దెతోటల పెంపకం, నూతన విత్తనాలకు సంబంధించి ఎగ్జిబిషన్ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు భవిష్యత్తు వ్యవసాయ పరిశోధనలు చేయాలన్నారు. రైతులు రసాయనిక, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేసి పెట్టుబడులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు, సుధాకర్, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మిప్రియ, మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



మాధవయ్య

సంజామల, జనవరి 18: సంజామల మండలం మిక్కినేనిపల్లె గ్రామానికి చెందిన సుంకరి మాధవయ్య అనే యువకుడు అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని సంజామల ఏఎస్ఐ నాగరాజు గురువారం తెలిపారు. వివరాలివీ.. సుంకరి మాధవయ్య హైదరాబాద్‌లో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. జనవరి 1న తేదీన తన స్వగ్రామమైన మిక్కినేనిపల్లెకు చేరుకొని తన తల్లిదండ్రులతో ఐదు రోజులు గడిపి జనవరి 5వ తేదీ హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. 6వ తేదీ నుంచి తమ కుమారుడు హైదరాబాద్‌కు వెళ్లినా ఫోన్ పని చేయకపోవడంతో తల్లిదండ్రులు సుంకరి రామలక్ష్మమ్మ, సుధాకర్ తమ బంధువుల వద్ద వెతికినా కనిపించకపోవడంతో గురువారం సంజామల ఏఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగు భూముల్లో హైడ్రో ప్రాజెక్టు వద్దు: సీపీఐ



పాతపాడులో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె, జనవరి 18: మండలంలోని పాతపాడు, మీరాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఏడాదికి మూడు పంటలు పండే పొలాల్లో హైడ్రో ప్రాజెక్టు ఏర్పాటు వద్దని సీపీఐ నాయకులు అన్నారు. పాతపాడులో వారు హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ హైడ్రో ప్రాజెక్టు పేరుతో రైతుల అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు ప్రారంభించడం దారుణమన్నారు. ఇప్పటికే సిమెంట్ ఫ్యాక్టరీల పేరుతో మైనింగ్ కోససమని రైతుల భూములు, ప్రభుత్వ భూములను గద్దల్లా తన్నుకుపోయారన్నారు. మైనింగ్ లేక ప్రస్తుతం రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండగా మరో 700 ఎకరాలు ప్రాజెక్టు కోసమంటూ భూమిని సేకరిస్తోందని అన్నారు. భూములు లాక్కుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, శివనాగయ్య, పతేనగర్ శివయక, సంజీవులు, పాతపాడు రైతులు పాల్గొన్నారు.

తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

బేతంచెర్ల, జనవరి 18: పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్‌లో ఆర్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి నిర్వహించారు. సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఎం సీనియర్ నాయకుడు సాధిక్ హుశేన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేబారాణి, నాయకులు రామాంజనేయులు, జె.శ్రీనివాసులు, సీహెచ్ మద్దిలేటి స్వామి, ఎస్.సాదిక్ హుశేన్, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు



కొత్తపల్లెలో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

చాగలమర్రి, జనవరి 18: మండలంలోని డి.వనిపెంట, కొత్తపల్లె, చక్రవర్తులపల్లె గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతలను ఎస్ఎస్ఎఫ్ సభ్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పూజలు చేసిన అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్లు ఎస్ఎస్ఎఫ్ సభ్యుడు సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంటిలో అక్షింతలచే పూజలు చేయాలని ప్రజలను కోరారు. గ్రామ పెద్దలు, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 18: చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు.

సర్పంచ్‌లకు శిక్షణ

రుద్రవరం, జనవరి 18: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. మండలంలోని పంచాయతీల్లో ఇకపై ఆన్‌లైన్‌లో అన్ని కార్యక్రమాలు కొనసాగాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్‌లోనే ఇంటి పన్నులు వసూలు చేసి నమోదు చేయాలన్నారు., పంచాయతీ పరిధిలో ప్రతి అంశం ఆన్‌లైన్‌లో కొనసాగించాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి వనరులు ఎలా సమకూర్చుకోవాలన్న అంశాలను వివరించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏవో వరలక్ష్మి, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

ప్యాపిలి, జనవరి 18: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ డోన్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు కుటుంబాన్ని గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు వై.లక్ష్మీనారాయణయాదవ్ కలచట్ల గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ అండగా ఉంటుందని ఆయన కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు రామ్మోహన్‌యాదవ్, కోదండరాము, చల్లా వీరాంజినేయులు, కలచట్ల ప్రసాద్, మద్దిలేటి, ఏనుగమర్రి రాము తదితరులు ఉన్నారు.